# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో చేపట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- 'ఆదరణ-3' కార్యక్రమాన్ని మరింత మెరుగ్గా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీరామ సత్యనారాయణ తెలిపారు.
- బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కోరారు.
- భారత్ - దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 క్రికెట్ సిరీస్ రేపటి నుంచి ప్రారంభం కానుంది.

====================

ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో చేపట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి పాత్రికేయుల సమావేశంలో ఈ రోజు మాట్లాడారు. విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే విద్యుత్ రంగాన్ని సమర్ధవంతంగా నిలబెడుతున్నామని, వచ్చే ఏడాది కూడా ఈ రంగంలో సమర్ధత పెంచుకుంటామని తెలిపారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రాజెక్టులపై మూల ధన వ్యయాన్ని గణనీయంగా పెంచి ప్రాజెక్టులు చేపట్టామని పేర్కొన్నారు. సాగునీటి వ్యవస్థను కూడా బలోపేతం చేశామని, 950 టీఎంసీల నీరు రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నిల్వ ఉందని ముఖ్యమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

ఇదిలా ఉండగా 2025-26 తొలి అర్ధ సంవత్సరం, అలాగే, 2వ త్రైమాసికానికగాను రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (GSDP) ఫలితాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. రెండో త్రైమాసికం ప్రస్తుత ధరల్లో రాష్ట్ర జీఎస్డీపీ మొత్తంగా 11.28 శాతం వృద్ధి చెందిందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

====================

'ఆదరణ-1, 2' కార్యక్రమాలకు కొనసాగింపుగా 'ఆదరణ-3' కార్యక్రమాన్ని మరింత మెరుగ్గా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీరామ సత్యనారాయణ వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ కులాలకు చెందిన వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, కుల సంఘాల ప్రతినిధులతో ఆయన ఈ రోజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 'ఆదరణ-3' కార్యక్రమాన్ని గతంలో కంటే మెరుగ్గా అమలు చేసేందుకు కుల సంఘాల ప్రతినిధులు ప్రజల సూచనలు తీసుకోవాలనే ప్రభుత్వ ఆదేశాలతో ఉత్తరాంధ్ర జిల్లాలలో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 550 వృత్తిపరమైన పరికరాలను గుర్తించడం జరిగిందని, వృత్తిపరంగా ఆధునిక పరికరాలను, నైపుణ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం యోచిస్తుందని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల రక్షణ కోసం బీసీ రక్షణ చట్టం ముసాయిదా సిద్ధమవుతోందని శ్రీరామ సత్యనారాయణ వెల్లడించారు.

====================

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో `భారతీయ భాషలలో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం` అంశంపై జాతీయ కార్యశాలను పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆంగ్ల పదాల స్థానంలో భారతీయ భాషల పదజాలం వాడాలన్న విశ్వవిద్యాలయం నిర్ణయాన్ని అభినందించారు. భారతదేశం అనేక భాషలు, సంస్కృతుల కేంద్రమని.. అందరూ మాతృ భాషలోనే మాట్లాడాలని వెంకయ్య నాయుడు అన్నారు. సోదర భాషలకు ప్రాధాన్యం ఇస్తూ.. అవసరమైతే పరాయి భాషలు నేర్చుకోవాలని సూచిస్తూ....

(వాయిస్ 31 సెకన్లు)

భారతీయ భాషలపై జాతీయ సదస్సు జరగడం ఎంతో ఆనందంగా ఉందని ఉపకులపతి ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ తెలిపారు.

విరామం

====================

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కోరారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఈ రోజు అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బాల్య వివాహలను నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' పేరిట 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక చేసిందని, నవంబర్ 27 నుండి మార్చి 8వ తేదీ వరకు మూడు విడతలుగా ఈ ప్రణాళిక అమలు చేస్తామన్నారు. విద్యార్థులతో ర్యాలీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని, పాఠశాల ప్రార్ధనా సమయంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సందేశాలు వినిపించాలని కలెక్టర్ సూచించారు.

====================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చే ఏడాది జనవరి 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారులు దావోస్ పర్యటనకు సంబంధించిన ప్రకటన ఈ రోజు విడుదల చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి రాష్ట్రంలో పెట్టుబడులపై పారిశ్రామిక వేత్తలతో చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ ఈ పర్యటనకు వెళ్లనున్నారు.

====================

భారత సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సైనికులు వారి ప్రాణాలు త్యాగం చేస్తూ.. దేశాన్ని సంరక్షిస్తున్నారని తెలిపారు. పతాక దినోత్సవం నిధికి ప్రజలు, వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలు విరివిరిగా విరాళాలు అందించాలని కోరారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన సైనికుల

కుటుంబాల సంక్షేమానికి విరాళాల రూపంలో సహాయం అందించేందుకు ముందుకు రావాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ ప్రజలను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి కె. కళ్యాణి వీణతో కలసి కలెక్టర్ స్టిక్కర్లను ఆవిష్కరించారు.

=====================

భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ రేపటి నుంచి ప్రారంభం కానుంది. తొలి టీ20 క్రికెట్ మ్యాచ్ ఒడిశాలోని కటక్ వేదికగా రేపు జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఇరు జట్లు ఇప్పటికే కటక్ నగరానికి చేరుకుని ప్రాక్టీస్‌ను మొదలు పెట్టాయి. ఇరు జట్ల మధ్య జరిగిన టెస్టు సిరీస్‌ను దక్షిణాఫ్రికా సొంతం చేసుకోగా.. వన్డే సిరీస్‌ను భారత్ తన ఖాతాలో వేసుకుంది.

=====================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ఫలితంగా ఉత్తర, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమలో రానున్న మూడు రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మి తెలియజేస్తూ...

(వాయిస్ 18 సెకన్లు)

=====================

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు విశాఖ వేదికగా నిర్వహించనున్న జాతీయ స్థాయి సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టీసియన్స్ సొసైటీ) ఎగ్జిబిషన్ - 2025కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డ్వాక్రా, స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసే నిమిత్తం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

=====================

ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియపై జిల్లా స్థాయి ఆధార్ కమిటీ సమన్వయ సమావేశం ఈ రోజు కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలలో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డు నమోదు తక్షణమే చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, జిల్లా సమగ్ర శిశు అభివృద్ధి పథక సంచాలకులకు సూచించారు.

=====================
=====================